సాక్షి
అనకాపల్లి
మంగళవారం । 3 । జనవరి । 2023



ఉపమాకలో పుణ్యకోటి వాహనంపై ఊరేగుతున్న స్వామివారు, (ఇన్‌సెట్) రంగనాథుని అలంకారంలో వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లు

- సింహాచలంలో భక్తులు కిటకిట
- ఉపమాకలో 8 వాహనాలపై 8 అలంకారాలతో స్వామికి తిరువీధి సేవలు

• అపురూపం.. వైకుంఠనాథుని దివ్యదర్శనం

వేయి కనులు చాలవులే..!



వైకుంఠవాసుడిగా దర్శనమిచ్చిన సింహాద్రి అప్పన్న



ఉత్తరద్వార దర్శనానికి క్యూల్లో వేచి ఉన్న భక్తులు

సింహాచలం: వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని సోమవారం వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్తర ద్వార దర్శనం చేసుకుని భక్తులు తరించారు. శ్రీదేవి, భూదేవి సమేతుడై స్వామి ఆలయ ఉత్తర రాజ గోపురంలో శేషతల్పంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం రాత్రి ఒంటి గంట నుంచి పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం వైదికులు విశేషంగా పూజలు ప్రారంభించారు. స్వామిని సుప్రభాతసేవతో మేల్కొలిపి ఆరాధన నిర్వహించారు. స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వైకుంఠవాసుడిగా అలంకరించారు. దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు తొలి దర్శనం చేసుకున్న అనంతరం స్వామిని ఉత్తర రాజగోపురంలో ఏర్పాటుచేసిన వేదికపై అధిష్టింపజేశారు. ఉదయం 5.45 గంటల నుంచి 10 గంటల వరకు భక్తులకు దర్శనాన్ని అందజేశారు. అనంతరం స్వామికి సింహగిరి మాడవీధిల్లో తిరువీధి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతా రామాచార్యులు, అర్చకులు ఈ పూజలు నిర్వహించారు. శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఎంపీ జీవీఎల్ నరసింహారావు, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర స్వామిని దర్శించుకున్నారు.

రంగనాథుడిగా వెంకన్న దర్శనం

నక్కపల్లి: ఉపమాక వెంకన్న ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా సోమవారం శ్రీదేవి భూదేవి సమేతుడైన వేంకటేశ్వరస్వామివారు రంగనాథుని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారు శయనిస్తుండగా అమ్మవార్లు కాళ్లు వత్తుతున్నట్లుగా అలంకరించిన రూపాన్ని చూసి భక్తులు ఆనందంతో మురిసిపోయారు. దేశంలో ఏ ఆలయంలో లేని విధంగా స్వామివారికి ఎనిమిది అలంకారాలతో, ఎనిమిది వాహనాల్లో తిరువీధి సేవలు నిర్వహించారు. స్వామివారికి అర్చక స్వాములు కృష్ణమాచార్యులు ఉదయం 3 గంటలకు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం గరుడాద్రిపై వెలసిన మూలవిరాట్ దర్శన భాగ్యాన్ని భక్తులకు ఉత్తర ద్వారం గుండా కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది ఉపమాక తరలివచ్చారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే మెట్ల మార్గం భక్తులతో కిటకిటలాడింది. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేతుడైన శ్రీవేంకటేశ్వరస్వామిని రంగనాథుని అవతారంలో అలంకరించి పుణ్యకోటి వాహనంపై ఊరేగించారు. రాజాధిరాజ వాహనంలో ఆండాళ్లమ్మవారిని, రుక్మిణీ సహిత వేణుగోపాల స్వామిని పొన్నవాహనంలోను, ఆంజనేయ వాహనంలో సీతారాములను, హంస వాహనంలో శయన పెరుమాళ్లను, లక్కగరుడ వాహనంలో చిన్నికృష్ణుని, గజవాహనంలో ప్రాకార పెరుమాళ్లను, పల్లకిలో బుల్లిరాముడిని ఉంచి ఉపమాక మాడ వీధుల్లో తిరువీధి సేవలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ అధికారులు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు.



ప్రధాన గాలిగోపురం వద్ద దర్శనానికి క్యూలో నిలుచున్న భక్తులు

న్యూస్‌రీల్

రూ.9 కోట్లతో 90 ఆలయాల నిర్మాణం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

గొలుగొండ: నర్సీపట్నం నియోజకవర్గంలోని నాతవరం, గొలుగొండ, నర్సీపట్నం, మాకవరపాలెం మండలాల్లో 90 దేవాలయాల నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం రూ.9 కోట్లు మంజూరు చేసినట్టు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. ఆయన సోమవారం గొలుగొండలో విలేకర్లతో మాట్లాడుతూ నర్సీపట్నం మండలంలో 20, నాతవరంలో 28, గొలుగొండలో 20, మాకవరపాలెంలో 22 దేవాలయాల నిర్మాణానికి ఈ నిధులు మంజూరయ్యాయని, ఈమేరకు సోమవారం జీవో విడుదలైందని చెప్పారు. రూ.10 లక్షలతో ఒక్కో దేవాలయం నిర్మిస్తారని, నిధులు మంజూరు చేసిన టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి నియోజకవర్గ ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు హారిక



హారికను అభినందిస్తున్న నరసింహారావు

పాయకరావుపేట: రాజస్థాన్ రాష్ట్రం దిద్వానాలో ఈ నెల 11 నుంచి జరుగనున్న 44వ బాలికల జూనియర్ నేషనల్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌కు శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థిని కర్రి హారిక ఎంపికైందని కళాశాల ప్రిన్సిపాల్ భానుమూర్తి తెలిపారు. డిసెంబరు 30, 31 తేదీల్లో అనంతపురం జిల్లా కదిరిలో జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో విశాఖపట్నం జిల్లా తరపున ఆడి అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను హారిక ఎంపికైందని చెప్పారు. హారికను శ్రీప్రకాష్ విద్యాసంస్థల అధినేత సిహెచ్.వి.కె.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్, వ్యాయమ ఉపాధ్యాయులు బాలరాజు, సురేష్ తదితరులు అభినందించారు.

నేటి నుంచి బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర జట్ల ఎంపిక

చోడవరం రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సారథ్యంలో అండర్ 19 బాల్‌బ్యాడ్మింటన్ రాష్ట్ర జట్టు ఎంపిక పోటీలను మంగళవారం నుంచి చోడవరంలో నిర్వహించనున్నారు. ఇందులో ప్రతిభ చూపినవారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించే పోటీల్లో రాష్ట్రంలోని అవిభక్త 13 జిల్లాల నుంచి జట్లు పాల్గొంటాయని ఉమ్మడి విశాఖ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి గోతిరెడ్డి రాంబాబు తెలిపారు. జిల్లా వృత్తి విద్యాధికారి ఆర్.సత్యనారాయణ పర్యవేక్షణలో మూడు రోజులు ఈ పోటీలు జరుగుతాయన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

- గతేడాది 6,385 కేసులు నమోదు చేశాం
- విద్యుత్ ఉద్యోగులపై వచ్చిన ఆరోపణలపైనా విచారణ
- శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని నివేదికలందించాం
- ఈపీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఏవీఎల్ ప్రసన్నకుమార్



సాక్షి, విశాఖపట్నం : ఏపీఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని చీఫ్ విజిలెన్స్ అధికారి ఏవీఎల్ ప్రసన్నకుమార్ స్పష్టం చేశారు. 2022–23కి సంబంధించిన వార్షిక నివేదికని ఆయన విడుదల చేశారు. ఏపీ ట్రాన్స్‌కో విజిలెన్స్ జేఎండీ మల్లారెడ్డి ఆదేశాల మేరకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు సర్కిల్స్ పరిధిలో 2022 జనవరి 1 నుంచి డిసెంబర్ 24 వరకూ నిర్వహించిన దాడుల్లో ఆపరేషన్ వింగ్, డీపీఈ వింగ్ సహకారంతో మొత్తం 6,385 కేసులు నమోదు చేసినట్లు వివరించారు. ఈ కేసులకు సంబంధించి అసెస్మెంట్, కాంపౌండింగ్ రుసుము కింద రూ.5.03 కోట్లు వసూలు చేసినట్లు తెలిపారు. విజిలెన్స్ సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహిస్తూ.. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటున్నారన్నారు. 2022లో 277 క్వాలిటీ కేసుల్ని విజిలెన్స్ సిబ్బంది నమోదు చేసి రూ.3.38 కోట్లు అపరాధ రుసుం వసూలు చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా.. విద్యుత్ శాఖ ఉద్యోగులపై వచ్చిన ఆరోపణలపైనా విచారణలు వేగవంతం చేసినట్లు సీవీవో ప్రసన్నకుమార్ వెల్లడించారు. విద్యుత్ ఉద్యోగులపై 83 పిటిషన్లు రాగా.. ఇందులో 58 పిటిషన్లపై విచారణ పూర్తి చేసి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ఈపీడీసీఎల్ సీఎండీకి నివేదికలు పంపించినట్లు తెలిపారు. ఏదైనా విద్యుత్‌కి సంబంధించిన సమస్య ఉత్పన్నమైనా, సమస్య పరిష్కరించేందుకు సిబ్బంది ఎవరైనా డబ్బులు అడిగినా.. 1912 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీగా ఉషారాణి

తుమ్మపాల: స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిగా రావికమతం సీడీపీవో ఉషారాణికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఐసీడీఎస్‌లో సీనియర్ అధికారి కావడంతో ఆమెను ఇన్‌చార్జి పీడీగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. పీడీ నందూరి సీతామహలక్ష్మి డిసెంబరు 31న ఉద్యోగ విరమణ చేశారు.

ఫీజులు ఆన్‌లైన్.. ముడుపులు ఆఫ్‌లైన్

- టెన్త్ నామినల్ రోల్స్ స్వీకరణకు ప్రైవేట్ స్కూళ్ల నుంచి వసూళ్లు
- ఒక్కో విద్యార్థి నుంచి రూ.100 నుంచి రూ.150 వరకు కలెక్షన్
- జిల్లా వ్యాప్తంగా 300 స్కూళ్లు, 3 వేలకు పైగా విద్యార్థులు



అనకాపల్లి డీఈఓ కార్యాలయం

సాక్షి, అనకాపల్లి: జిల్లా విద్యాశాఖ కార్యాలయం కేంద్రంగా టెన్త్ నామినల్ రోల్స్ స్వీకరణలో అక్రమ వసూళ్ల పర్వం కొనసాగుతుందనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. విద్యార్థుల నుంచి ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు వసూలు చేస్తే.. వారి నుంచి డీఈవో కార్యాలయ సిబ్బంది పిండుకుంటున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్ 3 నుంచి 18 వరకు జరగనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. ఇప్పటికే ఆన్‌లైన్‌లో స్కూళ్ల వారీగా హెచ్‌ఎంలు లాగిన్ అయి విద్యార్థుల వారీ పరీక్ష ఫీజు చెల్లించేశారు. తర్వాత వారి వివరాలతో ఆన్‌లైన్‌లో నామినల్ రోల్స్ సిద్ధం చేశారు. నామినల్ రోల్స్ హార్డ్ కాపీలను హెచ్‌ఎంలు ప్రతీ సంవత్సరం డీఈవో కార్యాలయంలో సమర్పించడం ఆనవాయితీ. ఈసారి కూడా హార్డ్ కాపీల స్వీకరణకు గత నెల 30న అనకాపల్లి జేఎంజే స్కూల్‌లో డీఈవో కార్యాలయ సిబ్బంది ప్రత్యేక కౌంటర్ పెట్టారు. ఒక సూపరింటెండెంట్, ఇద్దరు సిబ్బంది కలిసి స్కూళ్లవారీగా హార్డ్ కాపీలతో పాటు డబ్బులు వసూలు చేస్తున్నట్టు సమాచారం.

హార్డ్ కాపీలు ఇవ్వనక్కర్లేదు

గతంలో నామినల్ రోల్స్ హార్డ్ కాపీలు డీఈవో కార్యాలయంలో ఇవ్వాల్సి ఉండేది. కానీ ఇప్పుడు ఆన్‌లైన్‌లో విద్యార్థుల సమాచారం మొత్తం ఉండటంతో ఈ ఏడాది నుంచి నామినల్ రోల్స్ హార్డ్ కాపీలు డీఈవో కార్యాలయాల్లో ఇవ్వనక్కర్లేదు. ఆన్‌లైన్ వెరిఫికేషన్ సరిపోతుందని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు డిసెంబరు 30న ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ సిబ్బంది ఈ ఆదేశాలను బేఖాతరు చేసి వసూళ్లకు తెరతీసినట్టు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.

లొసుగులుంటే అదనం

ప్రైవేట్ యాజమాన్యాల లొసుగులు ఆసరాగా చేసుకొని భారీగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. విద్యార్థుల సంఖ్యను బట్టి ఒక్కో విద్యార్థికి రూ.100 నుంచి రూ.150 వరకు యాజమాన్యాల నుంచి వసూలు చేస్తున్నారు. ఇలా ఒక్కో స్కూల్ యాజమాన్యం రూ.6 వేల నుంచి రూ.10 వేల చొప్పున డీఈవో కార్యాలయ సిబ్బందికి ముట్టజెబుతున్నట్టు తెలిసింది. జిల్లాలో 300కు పైగా ప్రైవేట్ స్కూళ్లున్నాయి. ఇందులో సుమారు 3 వేల మంది టెన్త్ పరీక్షలకు హాజరుకానున్నారు. లిటిగేషన్ ఉన్న ప్రైవేట్ పాఠశాల నుంచి అయితే రూ.150 నుంచి రూ.200 వరకు వసూలు చేస్తున్నట్టు భోగట్టా. ఈ ఏడాది ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నామినల్ రోల్స్ హార్డ్ కాపీలు ఇవ్వాల్సిన అవసరం లేకపోయినా, వాటి కోసమే ఓ కౌంటర్‌ను ఏర్పాటు చేశారంటే.. ముడుపులకేనని తేటతెల్లమవుతోంది.

నా దృష్టికి రాలేదు



నామినల్ రోల్స్‌కు సంబంధించి వసూళ్లు చేస్తున్నారనే విషయం నా దృష్టికి రాలేదు. మాన్యువల్ నామినల్ రోల్స్ ఇవ్వాల్సిన అవసరం లేదు. అక్రమ వసూళ్లను ప్రోత్సహించవద్దని ప్రైవేట్ యాజమాన్యాలకు ముందుగానే చెప్పాం. అలాంటిదేమైనా ఉంటే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

–బి.లింగేశ్వరరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి

అశ్రునయనాలతో పీవీకి వీడ్కోలు

- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు
- తరలివచ్చిన బీజేపీ శ్రేణులు
- ప్రధాని మోదీ, జాతీయ నాయకుల సంతాపం



పీవీ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మిజోరం గవర్నర్ హరిబాబు



పీవీ చలపతిరావు అంతిమయాత్ర

మద్దిలపాలెం(విశాఖ తూర్పు): పార్టీ శ్రేణులు, అభిమానుల అశ్రునయనాల మధ్య బీజేపీ సీనియర్ నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆ పార్టీ తొలి అధ్యక్షుడు పి.వి.చలపతిరావు అంత్యక్రియలు జరిగాయి. ప్రభుత్వ లాంఛనాలతో క్వాంటెంట్ జంక్షన్ వద్ద చావులమదుం శ్మశాన వాటికలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు పిఠాపురం కాలనీలోని చలపతిరావు స్వగృహానికి మిజోరం గవర్నర్ డాక్టర్.కె.హరిబాబుకు చేరుకుని.. ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చలపతిరావు భౌతిక కాయానికి నివాళులర్పించి, తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, ఎంపీ జీవీఎల్ నరసింహారావు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, ఉమ్మడి రాష్ట్ర బీజేపీ పూర్వ అధ్యక్షుడు ఎస్.ఇంద్రసేనారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎం.ధర్మారావు, పల్లా శ్రీనివాసరావు, గండి బాబ్జీ, వైఎస్సార్ సీపీ యలమంచిలి నియోజకవర్గ పరిశీలకుడు రొంగలి జగన్నాథం, మంత్రి రాజశేఖర్, తెలంగాణ, కర్నాటకు చెందిన బీజేపీ నేతలు చలపతిరావు పార్థివదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సానుభూతి తెలిపారు.

జోహార్ పీవీ

పిఠాపురంకాలనీ నుంచి పి.వి. అంతిమయాత్ర మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైంది. కృష్ణా కళాశాల జంక్షన్ నుంచి ఎంవీపీకాలనీ, లాసన్స్‌బే కాలనీలోని పార్టీ కార్యాలయం వరకు, అక్కడి నుంచి సిరిపురం జంక్షన్ మీదుగా సెవెన్‌హిల్స్‌కూడలి, డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం మీదుగా కాన్వెంట్ జంక్షన్‌లోని చావులమదుం శ్మశానవాటిక వరకు సాగింది. అంతిమయాత్రలో చలపతిరావు అభిమానులు, పార్టీ నేతలతో పాటు ఆయన తనయుడు ఎమ్మెల్సీ మాధవ్, కుటుంబ సభ్యులు, యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్ర మోహన్, పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు ఎం.రవీంద్రరెడ్డి, మాజీ అధ్యక్షుడు నాగేంద్ర, పృథ్వీరాజ్, అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్ పాల్గొన్నారు. 50 బైక్‌లపై యువ మోర్చా ప్రతినిధులు ర్యాలీగా తరలివచ్చి.. జోహార్ పీవీ అంటూ నినాదాలు చేశారు.

ప్రధాని మోదీ సంతాపం సందేశం

దేశ ప్రధాని మోదీ తన సంతాప సందేశాన్ని చలపతిరావు తనయుడు, ఎమ్మెల్సీ మాధవ్‌కు సోమవారం పంపించారు. తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. పీవీ మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. పలువురు జాతీయ నేతలు పీవీ మృతికి సంతాపాన్ని ప్రకటించారు.



పీవీ భౌతికకాయం వద్ద బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు

చలపతిరావు సేవలు మరువలేనివి

బీజేపీ సీనియర్ నాయకుడు పి.వి.చలపతిరావు సేవలు మరువలేనివని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. చలపతిరావు మరణ వార్త తెలియగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సమాచారం అందించామన్నారు. ప్రభుత్వ లాంఛనాలతో చలపతిరావు అంత్యక్రియలు నిర్వహించాలని సీఎం కలెక్టర్‌ను ఆదేశించారన్నారు.

గొప్ప నాయకుడికి కోల్పోయాం

బీజేపీ గొప్ప నాయకుడిని కోల్పోయిందని మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు అన్నారు. ఎమర్జెన్సీ సమయంలో ఇందిరాగాంధీని ఎదిరించి నిలిచిన పోరాటయోధుడు చలపతిరావు అని కొనియాడారు. ఆయన చేసిన పోరాటాలను యువ నేతలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

అనితర సాధ్యం ఈ సంక్షేమం

- అందరికీ అందేలా కృషి చేయాలి
- సచివాలయ కన్వీనర్లపై గురుతర బాధ్యత
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్



మహిళకు కొత్తగా మంజూరైన పింఛన్ అందజేస్తున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అనుసరిస్తున్న విధానాలు అనితర సాధ్యమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నూతనంగా మంజూరైన పింఛన్‌దారులకు నగదు పంపిణీ చేసి, సచివాలయాల కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అర్హులైన లబ్ధిదారులకు రూ.లక్షా 85 వేల కోట్లు ఖర్చు చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అవ్వాతాతలకు ఇచ్చిన మాట ప్రకారం దశలవారీగా పింఛన్ పెంచారని, ఈనెల నుంచి రూ.2750లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా చేరేలా చూసేందుకు ఒక్కొక్క సచివాలయ పరిధిలో ముగ్గురు కన్వీనర్లను నియమించారన్నారు. ఈనెల 6 నుంచి 26వ తేదీ వరకూ సచివాలయ కన్వీనర్లు.. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరిస్తారని తెలిపారు. పార్టీ నుంచి ఎటువంటి సమాచారం వచ్చినా నేరుగా సచివాలయ కన్వీనర్ల ద్వారా ప్రజలకు (యాప్ ద్వారా) చేరవేయడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిది అమృత హృదయమని, మెడికల్ కళాశాల శంకుస్థాపనకు వచ్చిన సందర్భంగా పలువురు తమ కుటుంబ సభ్యుల అనారోగ్య సమస్యల గురించి విన్నవించుకోగా.. ఒక్కొక్కరికి రూ.లక్ష వంతున 13మందికి తక్షణ సాయం అందించారన్నారు. కార్పొరేటర్ మందపాటి సునీత, పట్టణ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు ఎ.వి.రత్నకుమారి, పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పట్టణ పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణ అప్పారావు పాల్గొన్నారు.



మాడుగుల రూరల్: విశాఖలో చికిత్స పొందుతున్న పెదపాటి జగన్నాథరావు (కె.జె.పురం) కు పెన్షన్ అందిస్తున్న వలంటీర్ రాపేట ప్రసాద్



దేవరాపల్లి: ఎం.అలమండ వలంటీర్ గోవాడ నాగరాజేశ్వరి విశాఖలో ఉన్న గూనూరు రాము, కామిరెడ్డి బంగారమ్మ, రొంగలి కన్నంనాయుడుకు పెన్షన్ పంపిణీ చేశారు.

క్లుప్తంగా

బేస్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు దొండపూడి విద్యార్థులు



రాష్ట్ర పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీఈటీ ఉపాధ్యాయులు

రావికమతం : దొండపూడి హైస్కూల్ విద్యార్థులు గ్రటెడ్డి పుష్పలత, గోకాడ జోత్స్న, గ్రటెడ్డి నిహాంత్ కుమార్ రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. నర్సీపట్నం మండలం వేములపూడిలో గత నెల 31న జరిగిన జిల్లా స్థాయి పోటీలలో వారు అండర్-17 విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. త్వరలోనే కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని హెచ్‌ఎం వి.వి.ఎస్ నాగేశ్వరరావు తెలిపారు. ఇంతటి ప్రతిభ చూపిన ఆ విద్యార్థులను పీఈటీ పుష్పవల్లిని ఆయన అభినందించారు.

గాయపడ్డ ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుడు మృతి



భీశెట్టి వెంకటరామయ్య

మునగపాక : బైకు ప్రమాదంలో గాయపడ్డ మూలపేటకు చెందిన స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. దీంతో గ్రామంలో విషాదం అలముకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మూలపేటకు చెందిన భీశెట్టి వెంకటరామయ్య (48) స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికునిగా పనిచేస్తున్నాడు. గత నెల 30న మూలపేట నుంచి బైక్‌పై విధులకు వెళుతుండగా పరవాడ మండలం గొల్లలపాలెం సమీపంలో ఆటో పక్కగా వెళుతున్న సమయంలో ప్రమాదవశాత్తూ బైక్‌పై నుంచి కిందపడిపోయాడు. ఈ సంఘటనలో తలకు తీవ్ర గాయమైన వెంకటరామయ్యను విశాఖ కేజీహెచ్‌కు తరలించిన విషయం తెలిసిందే. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతిచెందారు. సోమవారం కేజీహెచ్‌లో పోస్టుమార్టం పూర్తయ్యాక మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడు వెంకటరామయ్యకు భార్య శ్యామల, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సకాలంలో అర్జీలకు 'స్పందన'



ఆర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి, జేసీ కల్పనాకుమారి, సహాయ కలెక్టర్ ధాత్రిరెడ్డి



ఆర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ గౌతమిసాలి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం
- కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమానికి 110 అర్జీలు

తుమ్మపాల : స్పందన గ్రీవెన్స్‌కు వస్తున్న అర్జీలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్, జేసీ కల్పనాకుమారి, సహాయ కలెక్టర్ ధాత్రిరెడ్డి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. స్పందన వినతులు పెండింగ్ ఉండకుండా చూసే బాధ్యత సంబంధిత అధికారులపై ఉంటుందన్నారు. నిర్ణిత గడువులోగా ఆర్జీదారుడికి సరైన సమాధానం ఇవ్వాలన్నారు. స్పందన వినతులు 110 వచ్చాయి. డీఆర్వో పి.వెంకటరమణ వృద్ధులు, వికలాంగుల వద్ద వినతులు స్వీకరించి వారి సమస్యలు తెలుసుకున్నారు.

గురుకుల పాఠశాల నిర్మాణానికి స్థలం కేటాయించండి : కర్రి గంగాధర్

అనకాపల్లిలో అద్దె భవనంలో మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల బాలుర సంక్షేమ గురుకుల పాఠశాలకు శాశ్వత భవన నిర్మాణం జరిగేలా స్థల కేటాయింపు చేయాలని తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కర్రి గంగాధర్ కలెక్టర్‌కు వినతి అందించారు. పాఠశాల అప్‌గ్రేడ్, ఉపాధ్యాయుల కొరత, పోషకాహారం కొరత వంటి అనేక సమస్యలపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

ల్యాండ్ పూలింగ్ బాధితులకు న్యాయం చేయాలి : రైతు కూలీల సంఘం

నవరత్నాలు-పేదలందరికి ఇల్లు పథకం కోసం రైతుల నుంచి సేకరించిన భూములకు బదులుగా వుడా అప్రూవుడ్ లేఅవుట్‌లలో ఇస్తామన్న రెసిడెన్షియల్ ప్లాట్‌లు (ఎల్‌పీఓసీ)లను తక్షణమే రైతులకు అందించాలని రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో అనకాపల్లి మండలంలో 12 గ్రామాల రైతులు డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద నిరసన చేసారు. మండలంలో మామిడిపాలెం, సంతపాలెం, పాపయ్యసంతపాలెం కూండ్రం, కుంచంగి, వెంకుపాలెం, సంపతిపురం పలు గ్రామాల్లో రైతులు సాగు చేసుకుంటున్న 1452 ఎకరాల డీ-పట్టా, సాగు భూములను సేకరించారన్నారు.

జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ రద్దుకు వినతి

జిల్లాలో కొత్తగా నియమించిన జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు కలెక్టరేట్ వద్ద నిరసన చేసి, తమ సమస్యను కలెక్టర్‌కు విన్నవించారు. ప్రస్తుత కమిటీని రద్దు చేసి నూతన కమిటీకి నోటిఫికేషన్ ఇవ్వాలని, కమిటీలో ఎస్సీల్లో గల అన్ని కులాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎలూసురు గాటీలు మాదిగ అన్నారు.

రైతు కూలీలకు భూములివ్వాలి : వ్యవసాయ కార్మికుల సంఘం

రాష్ట్రంలో ప్రభుత్వ భూములను సాగుభూమి లేని నిరుపేదలైన వ్యవసాయ కూలీలకు పంపిణీ చేయాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద వ్యవసాయ కార్మికుల సంఘం నిరసన ప్రదర్శన జరిపింది. ప్రభుత్వ భూములను సాగు చేసుకునేందుకు గతంలో వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం కోనేరు రంగారావు కమిటీని నియమించిందని తెలిపారు. కమిటీ సిఫార్సులను అమలు చేస్తూ నవరత్నాల్లో చేర్చి పేదలకు భూములు పంపిణీ చేయాలని కోరారు. దీంతో పాటు దీర్ఘకాలగా పేదల సాగులో ఉన్న ప్రభుత్వ భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శివలంక కొండలరావు, మాకిరెడ్డి రామునాయుడు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో స్పందనకు 25 ఆర్జీలు

అనకాపల్లిటౌన్ : ఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో 25 ఆర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ఎస్పీ గౌతమిసాలి మాట్లాడుతూ ప్రజల నుంచి ఆర్జీలు స్వీకరిస్తూ, వారి సమస్యలను తెలుసుకుంటూ, సంబంధిత దిగువ స్థాయి సిబ్బందికి ఆమె ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. చట్టపరిధిలో సమస్యలను త్వరితగతిన పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ప్రధానంగా ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ తదితర ఆర్జీలు వచ్చినట్టు పేర్కొన్నారు.

సీతామహాలక్ష్మి సేవలు నిరుపమానం



పదవీ విరమణ చేసిన నండూరి సీతామహాలక్ష్మిని ప్రశంసిస్తున్న కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి, అధికారులు

తుమ్మపాల: మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి, ఉప కలెక్టర్ నండూరి సీతామహాలక్ష్మి వృత్తి పట్ల నిబద్ధత, ప్రజ్ఞతో తన పదవికే వన్నె తెచ్చారని కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి ప్రశంసించారు. డిసెంబర్ 31న పదవీ విరమణ చేసిన ఆమెకు జిల్లా అధికారుల సంఘం కలెక్టరేట్‌లో సోమవారం సన్మాన సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై ఆమె సేవలను కొనియాడారు. ఆమెకు గల సమయపాలన, చట్టాల పట్ల పరిజ్ఞానం ప్రతి అధికారి నేర్చుకోవాలన్నారు. ఎన్.సీతామహాలక్ష్మి మాట్లాడుతూ పట్టదలతో ఎలాంటి కార్యమైనా సాధించవచ్చని చిన్నతనంలోనే నేర్చుకున్నానన్నారు. ఏ శాఖలో పనిచేసినా.. సహోద్యోగులు, ఉన్నతాధికారుల సహాయ సహకారాలతోనే విజయం సాధించగలమన్నారు. మంచి ఆలోచనలతో కష్టపడి పనిచేస్తే అందరికీ సాయపడగలమని తెలిపారు. జిల్లా అధికారులు సంఘం అధ్యక్షుడు సీపీవో రామారావు, మత్స్యశాఖ అధికారి లక్ష్మణరావు స్వాగత, వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో జేసీ కల్పనాకుమారి, సహాయ కలెక్టర్ ధాత్రిరెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్, డ్వామా పీడీ సందీప్, డీహెచ్‌వో ప్రభాకరరావు, జీఎం ఐడీసీ శ్రీధర్, డీపీవో శిరీషారాణి, డీఎల్‌డీవో మంజులవాణి పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేస్తాం

- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణి



స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణికి అభినందనలు తెలుపుతున్న దళిత సంఘాల ఐక్యవేదిక సభ్యులు

యలమంచిలి : రాంబిల్లి నేవల్ బేస్ నిర్వాసితుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణి చెప్పారు. సోమవారం యలమంచిలిలో కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా విశాఖపట్నం దళిత సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు ఆధ్వర్యంలో సంఘ సభ్యులు అందరు ఆమెకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెతో బూసి వెంకటరావు మాట్లాడుతూ రాంబిల్లి నేవల్ బేస్ ప్రాజెక్టులో భాగంగా భూములు, ఉపాధి కోల్పోయిన రాంబిల్లి, ఎస్ .రాయవరం, నక్కపల్లి మండలాలకు చెందిన చెందిన దళితులకు జీవనోపాధి కల్పించాలని ఆమెను కోరారు. కార్యక్రమంలో దళిత సంఘం ఐక్యవేదిక యలమంచిలి జోన్ నాయకులు గొంపాన అప్పారావు, జి.గంగరాజు, కూరపాటి రాము, మాదల శ్రీనివాస్, బొత్సా అప్పారావు, సంపర జోగారావు, త్రిమూర్తులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న దిలీప్‌కుమార్

అనకాపల్లిటౌన్ : మంత్రిగా గుడివాడ అమర్‌నాథ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొట్ట మొదట జన్మదిన వేడుకలను పురస్కరించుకొని జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ఏర్పాటు చేసినట్టు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ అన్నారు. మండలంలో మార్టూరు గ్రామంలో సోమవారం ఆయన పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ వరకు ఈ పోటీలు కొనసాగుతాయన్నారు. పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 60 బృందాలు పాల్గొన్నాయని పేర్కొన్నారు. పోటీల్లో విజేతలకు అదే రోజు బహుమతి ప్రధానోత్సవం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, అన్నపూర్ణ బ్యాంకు చైర్మన్ పిడి.గాంధీ, మార్టూరు సర్పంచ్ కరణం రెవెన్యూనాయుడు, ఎంపీటీసీలు మిద్దె రాజా రామచంద్రరావు, పంచదార్ల కన్నారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఒమ్మి మధుబాబు పాల్గొన్నారు.

క్రమశిక్షణ న్యాయవాదుల ఉన్నతికి సోపానం



న్యాయమూర్తి రామ శ్రీనివాసరావును సన్మానిస్తున్న విశాఖ న్యాయవాదుల సంఘం సభ్యులు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తుల గోపి

విశాఖ లీగల్ : క్రమశిక్షణ న్యాయవాదుల ఉన్నతికి సోపానమని విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తుల గోపి అన్నారు. సోమవారం జిల్లా కోర్టులోని న్యాయవాదుల గ్రంథాలయంలో విశాఖ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఇటీవల పదవిరమణ చేసిన పోక్సో కోర్టు న్యాయమూర్తి జి.రామశ్రీనివాసరావు సన్మాన సభ జరిగింది. సభలో న్యాయమూర్తి గోపి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. న్యాయమూర్తి శ్రీనివాసరావు యువ న్యాయవాదులకు ఒక నిఘంటువని పేర్కొన్నారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వైద్యుల రవీంద్ర ప్రసాద్ మాట్లాడుతూ న్యాయమూర్తి ప్రస్థానం అందరికి ఆదర్శమన్నారు. అనంతరం సంఘం కార్యదర్శి వై.వేణుగోపాల్, మెట్రోపాలిటిన్ సెషన్స్ జడ్జి తిరుమల రావు, శాశ్వత ప్రజాన్యాయపీఠం న్యాయమూర్తి జి.వల్లభ నాయుడు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు బైపా అరుణ్‌కుమార్, నమ్మి సన్యాసిరావు, పోక్సో కోర్టు ప్రత్యేక ఏపీపీ కరణం కృష్ణలు న్యాయమూర్తి శ్రీనివాసరావుని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ న్యాయమూర్తులు, న్యాయవాదులు నిరంతర విద్యార్థులుగా అభివర్ధించారు. విశాఖ న్యాయవాదుల సహకారం మరువలేనిదన్నారు. అందరికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇస్కాన్‌కు భక్తుల తాకిడి



వేంకటేశ్వరుడు, పద్మావతి దేవిగా రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్‌లోని ఇస్కాన్‌లో అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజామున 4.30 గంటల నుంచి భక్తులకు ఉత్తరద్వార దర్శనం ప్రారంభించారు. ముందుగా రాధాదామోదరులను వేంకటేశ్వర స్వామి, పద్మావతి దేవిగా అలంకరించారు. స్వామి, అమ్మవార్లకు పుష్పాలతో అలంకరించారు. మంగళహారతి, భగవద్గీత, బ్రహ్మ సంహిత పారాయణం నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాంబాదాస్ ప్రభూజీ వైకుంఠ ఏకాదశి ప్రాముఖ్యాన్ని వివరించారు.

త్వరలోనే 'అదానీ'కి శంకుస్థాపన



సంస్థ కార్యకలాపాల కోసం ఈ రహదారిని విస్తరించనున్న అదానీ



హిల్-4లో అదానీకి స్థలం కేటాయించినట్లు బోర్డు ఏర్పాటు చేసిన ఏపీఐఐసీ

- హిల్-4లో 130 ఎకరాలు సిద్ధం చేసిన ఏపీఐఐసీ
- లీజు మొత్తం ప్రభుత్వానికి చెల్లించిన సంస్థ
- సరిహద్దులు సిద్ధం చేసిన ఏపీఐఐసీ
- ఏడేళ్లలో రూ.14,634 కోట్ల పెట్టుబడులు

సాక్షి, విశాఖపట్నం: రూ.14,634 కోట్లతో పాతిక వేల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా విశాఖలో అదానీ ఎంటర్ ప్రైజెస్ లిమిటెడ్ సంస్థ ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ డేటా సెంటర్ పార్క్ ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. లీజు మొత్తం చెల్లించిన అదానీ కోసం హిల్‌పార్క్-4లో 130 ఎకరాలను ఏపీఐఐసీ సిద్ధం చేసి.. సరిహద్దులను కూడా నిర్ణయించింది. త్వరలోనే అదానీ డేటా పార్క్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి సంబంధించిన తేదీలు త్వరలోనే ఖరారు చేయనున్నారని కలెక్టరేట్ వర్గాలు వెల్లడించాయి. డేటా సెంటర్ పార్క్, ఐటీ బిజినెస్ పార్క్, నైపుణ్యాభివృద్ధి వర్సిటీ, రిక్రియేషన్ సెంటర్ నిర్మాణాలకు మధురవాడ సర్వే నెంబర్ 409లో ఎకరం రూ.కోటి చొప్పున 130 ఎకరాలను ప్రభుత్వం అదానీ సంస్థకు కేటాయించింది. భూమి ఇచ్చిన మూడేళ్లలోపు కచ్చితంగా కార్యకలాపాలు ప్రారంభించాలని, ఏడేళ్లలోపు నిర్మాణాలు పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో 82 ఎకరాల్లో 200 మెగావాట్ల సామర్థ్యంలో డేటా సెంటర్ పార్క్, 28 ఎకరాల్లో ఐటీ బిజినెస్ పార్క్, 11 ఎకరాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ, 9 ఎకరాల్లో రిక్రియేషన్ పార్క్ ఏర్పాటు చేయనుంది. అదానీ కోసం కేటాయించిన స్థలానికి ఎకరానికి రూ. కోటి చొప్పున లీజు మొత్తం నిర్ణయించగా.. మొత్తం రూ.130 కోట్లుని ఇటీవలే సంస్థ ప్రతినిధులు ప్రభుత్వానికి చెల్లించారు. అదానీకి అందివ్వాల్సిన భూముల సరిహద్దుల్ని ఏపీఐఐసీ సిద్ధం చేసింది. ఏడేళ్ల కాలం పాటు చెల్లించే స్టేట్ జీఎస్టీ రీయంబర్స్‌మెంట్ ప్రభుత్వం చెల్లించనుంది. మొదటి మూడేళ్ల కాలంలో 30 మెగా వాట్లు డేటా సెంటర్ పార్క్ పూర్తి చేయడంతో పాటు, నాలుగేళ్ల నాటికి 60 మెగావాట్లు, 5 ఏళ్లకు 110 మెగావాట్లు, 6 ఏళ్లకు 160 మెగావాట్లు, ఏడేళ్లకు 200 మెగావాట్లు కింద మొత్తం వ్యవస్థని ఏర్పాటు చేయనున్నారు. ఉద్యోగ కల్పన విషయంలోనూ దశలవారీ పురోగతి చూపించనున్నారు. మొదటి మూడేళ్ల కాలంలో 30 శాతం మందికి, ఐదేళ్ల నాటికి 70 శాతం, ఏడేళ్లకు 100 శాతం ఉద్యోగ, ఉపాధి కల్పన పూర్తి చేయనున్నారు. 200 మెగావాట్ల డేటాసెంటర్ పార్కులో 1240 మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు, ఐటీ బిజినెస్ పార్కులో 1200 మందికి ప్రత్యక్ష ఉపాధి, ఐటీ బిజినెస్ పార్కు ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఐటీ కంపెనీల ద్వారా 21,000 మందికి ఉపాధి, ఉద్యోగవకాశాలు కల్పించనున్నారు. స్కిల్ యూనివర్సిటీ ద్వారా 500 మందికి, రిక్రియేషన్ ద్వారా 1000 మందికి ప్రత్యక్ష ఉపాధి కల్పించేలా అదానీ సెంటర్ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొమ్మాది : జవహర్ నవోదయ విద్యాలయంలో 2023-24 విద్యాసంవత్సరంలో 6వ తరగతి ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.సంజయ్ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలోని ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదువున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు 1.05. 2011 నుంచి 30.04.2013 మధ్య జన్మించి ఉండాలన్నారు. నవోదయ విద్యాలయ సమితి వెబ్‌సైట్ www.navodaya. gov.in లో ఈనెల 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష 29.04.2023న నిర్వహిస్తామని తెలిపారు.

సీఐలకు స్థాన చలనం

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): విశాఖపట్నం రేంజ్ పరిధిలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న పి.రమణయ్యను నర్సీపట్నం సర్కిల్‌కు, నర్సీపట్నం సర్కిల్‌లో ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న కె.శ్రీనివాసరావును విశాఖపట్నం రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు.

ట్రాక్టర్ కిందకు దూసుకెళ్లిన స్కూటీ

- గిరిజన యువకుడు మృతి
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు



మృతిచెందిన గిరిజన యువకుడు ఈశ్వరరావు



ప్రమాద సంఘటన దృశ్యాలు

సాక్షి, పాడేరు: పట్టణంలోని తలారిసింగి జంక్షన్ సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ట్రాక్టర్ వెనుక భాగంలోకి స్కూటీ దూసుకెళ్లడంతో గిరిజన యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరి గిరిజన యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. హుకుంపేట మండలం దిగుడుపుట్టు నుంచి స్కూటీపై గిరిజన యువకులు ఈశ్వరరావు, త్రినాథ్, గుల్లెలి సాయికుమార్‌లు సాయంత్రం పాడేరు బయలుదేరారు. తలారిసింగి జంక్షన్‌లో ఎదురుగా వస్తున్న పల్సర్ బైకును తప్పించే ప్రయత్నంలో ముందు వెళ్తున్న ట్రాక్టరు వెనుక భాగంలోకి స్కూటీ దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో గడ్డంగి ఈశ్వరరావు(23)తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్కూటీ వెనుక కూర్చున్న గుల్లెలి సాయికుమార్, త్రినాథ్ లకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని హుటాహుటిన పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందించారు. త్రినాథ్‌కు ఎడమకాలు విరిగిపోయింది. సాయికుమార్‌కు పలు చోట్ల గాయాలయ్యాయి. ఈ ప్రమాద సంఘటనపై పాడేరు ఎస్ఐ లక్ష్మణ్ కేసు నమోదు చేశారు.

ఉదయం నుంచి వరిపనలు మోసి..

ఈ ప్రమాదంలో మృతి చెందిన ఈశ్వరరావు, గాయపడ్డ త్రినాథ్, సాయికుమార్‌లు మిత్రులేకాక, బంధువులు కూడా. ప్రస్తుతం ధాన్యం నూర్పుల పనులు కావడంతో ముగ్గురూ ఉదయం నుంచి సాయంత్రం వరకు కోసిన వరిపనల మోతలో పాల్గొన్నారు. సాయంత్రం సరదాగా పాడేరుకు స్కూటీపై బయలుదేరారు. ఉదయం నుంచి పనులతో అలసిన ఈ ముగ్గురు మిత్రులు ఆటవిడుపుగా బయల్దేరి పాడేరుకు కొద్ది నిమిషాల్లో చేరుకుంటారనగా ప్రమాదానికి గురయ్యారు.

దిగుడుపుట్టులో విషాదం

గిరిజన యువకుడు ఈశ్వరరావు మృతిచెందడం, ఒకే కుటుంబానికి చెందిన త్రినాథ్, సాయికుమార్‌లు తీవ్రంగా గాయపడిన సంఘటనతో హుకుంపేట మండలంలోని దిగుడుపుట్టు గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి. ముగ్గురు ఆడపిల్లల తర్వాత పుట్టిన ఈశ్వరరావును తల్లిదండ్రులు కొండబాబు, ముత్యాలమ్మలు అల్లారుముద్దుగా పెంచుకున్నారు. టెన్త్ వరకు చదివిన ఈశ్వరరావు వ్యవసాయంపై మక్కువతో పై చదువులకు దూరమయ్యాడు. తల్లిదండ్రులకు తోడుగా ఇంటికి పెద్దదిక్కుగా మారాడు. ఈ పరిస్థితిలో ఈశ్వరరావు మరణం తల్లిదండ్రులకు తీవ్ర వేదన కలిగించింది. ప్రమాద సంఘటనను తెలుసుకున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ విచారం వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలు కల్పించాలని వైద్యులకు ఫోన్‌లో ఎమ్మెల్యే సూచించారు. అలాగే ఎంపీపీ రాజుబాబు, జెడ్పీటీసీ రేగం మత్స్యలింగంలు కూడా ప్రమాద సంఘటనపై విచారం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

రామన్నపాలెంలో 'గడప గడపకు' నేడు

కశింకోట: మండలంలోని విసన్నపేట శివారు రామన్నపాలెంలో మంగళవారం ఉదయం 10 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరగనుందని ఎంపీపీ కలగా లక్ష్మి తెలిపారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రతులను లబ్ధిదారులకు అందజేసి ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తారన్నారు. కశింకోట మండల పరిషత్ కార్యాలయం వద్ద మధ్యాహ్నం 12 గంటలకు మంత్రి చేతుల మీదుగా కొత్త పింఛన్లను అందిస్తారని చెప్పారు.

ఫ్లై ఓవర్ ఎలైన్‌మెంట్‌ను మార్చి నిర్మించాలి



ఆర్డీవోకు వినతిపత్రం అందజేసిన లక్ష్మీదేవిపేట వాసులు

అనకాపల్లిటౌన్: లక్ష్మీదేవిపేట ఫ్లై ఓవర్ ఎలైన్‌మెంట్‌ను మార్పు చేసి నిర్మించాలని ఆ ప్రాంత ప్రజలు కోరారు. ఈమేరకు సోమవారం ఆర్డీవో చిన్నికృష్ణను తన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మార్పు చేయని విధంగా బ్రిడ్జి నిర్మిస్తే ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన మల్లమ్మ గుండం కోల్పోవాల్సి వస్తోందని వారు పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ఆర్డీవో.. బ్రిడ్జి నిర్మాణంపై విచారణ జరపాలని తహసీల్దార్ గంగాధర్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో మాదేటి సత్యనారాయణ, మొల్లేటి కొండలరావు, బొడ్డేడ ఆదినారాయణ పాల్గొన్నారు.

లీగ్ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ



రజత పతకం సాధించిన విద్యార్థి స్వరూప్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం నారాయణరావు

అనకాపల్లిటౌన్: ఇటీవల నర్సీపట్నంలో జరిగిన లీగ్ బాక్సింగ్ పోటీల్లో మండలంలోని కొత్త తలారివానిపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థి నందారపు జ్యోతిస్వరూప్ ప్రతిభ చూపాడు. సబ్ జూనియర్ విభాగంలో రజత పతకం కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో స్వరూప్‌ను హెచ్‌ఎం రెడ్డి నారాయణరావు అభినందించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 13,407 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,400	4,000
మొదటి రకం	3,280	3,620
రెండో రకం	3,050	3,220
మూడో రకం	2,820	3,040

అనకాపల్లి సినిమాలు

ధమాకా	- రాజా
ఎస్ 5(నో ఎగ్జిట్)	-సత్యనారాయణ స్క్రీన్-1
అవతార్-2	-సత్యనారాయణ స్క్రీన్-2
18 పేజెస్	-షిర్డిసాయి
అవతార్-2	-పర్తిసాయి
టాప్‌గేర్	-వెంకటేశ్వర
లక్కీ లక్ష్మణ్ (మార్నింగ్, మేట్నీ)	
రాజయోగం (ఫస్ట్ షో, సెకండ్ షో)	- శ్రీసత్య
అవతార్-2	- రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 62 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-12 యూనిట్లు, ఏ నెగిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-8 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-34 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9182834480)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 487 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 463 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

నమో నారాయణాయ

- వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు
- వైష్ణవాలయాల్లో నేత్రపర్వంగా ఉత్తర ద్వార దర్శనం
- కనులపండువగా శ్రీనివాసుడి కల్యాణోత్సవం
- తిలకించి తరించిన భక్తజనం



కశింకోటలోని వేణుగోపాల స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు



మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు దేవునిగుమ్మం వేంకటేశ్వర స్వామి ప్రసాదాన్ని అందిస్తున్న ఈవో రమాబాబు, అర్చకుడు గిరిబాబు



వజ్ర కవచ అలంకరణలో ధ్యాన వేంకటేశ్వర స్వామి

కశింకోట: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా సోమవారం వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా వైష్ణవాలయాల్లో స్వామిని భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకుని తరించారు. దేవదేవుడి నామ స్మరణతో ఆలయాలు మార్మోగాయి. కశింకోటలోని దేవదాయ శాఖకు చెందిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకుడు రేజేటి సీతారామాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు చేశారు. పూల, తులసి మాలలతో స్వామిని అలంకరించి విష్ణు సహస్రనామార్చన జరిపారు. భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. గరుడ వాహనంపై వేణుగోపాల స్వామి, గజ వాహనంపై శ్రీరాముడి విగ్రహాలను ఆలయం నుంచి గ్రామ ప్రధాన వీధుల్లో ట్రాక్టర్లపై ఊరేగించగా.. ప్రజలు దర్శించి పూజలు చేశారు.

ధ్యాన వేంకటేశ్వరుడి ఆలయంలో..

ఇక్కడి శివాలయం వద్ద ఉన్న ధ్యాన వేంకటేశ్వర స్వామి ఆలయంలో పంచామృతాభిషేకం నిర్వహించారు. వజ్ర కవచంతో స్వామిని అలంకరించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. ఆలయాన్ని పూల దండలు, ద్రాక్ష గుత్తులతో అలంకరించారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో..

కశింకోటలోని పురాతన లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని పూలు, తులసి మాలలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ అర్చకుడు అత్తిలి కోదండపాణి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

నరసింగబిల్లిలో..

మండలంలోని నరసింగబిల్లిలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించారు. ఆలయ కమిటీ ప్రతినిధి మజ్జి ప్రసాదరావు, సర్పంచ్ కోన అరుణ, వైఎస్సార్‌సీపీ నరసింగబిల్లి కమిటీ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు, సోమవరం మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు, పాల సంఘం కార్యదర్శి జెర్రిపోతుల నూకినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా వెంకన్న కల్యాణం

వైకుంఠ ఏకాదశి సందర్భంగా కశింకోట గవరపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరాలయంలో స్వామి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఆలయం నుంచి సంతబయల వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి తిరిగి కల్యాణ దంపతులు భీశెట్టి దామోదరరావు, హరిణితోపాటు సారె ఊరేగింపు, మహిళల కోలాటాలు, చిటికెన భజనలు, మేళతాళాలతో ఆలయానికి తీసుకొచ్చారు. అక్కడ అలంకరించిన వేదికపై ఉత్సవ విగ్రహాలకు శాస్త్రోక్తంగా ప్రధాన అర్చకుడు వ్యాసాచార్యుల ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు కల్యాణాన్ని జరిపించారు. సోమవారం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన చేశారు. అనంతరం ప్రదర్శించిన కోలాటాలు, చిటికెన భజనలు అలరించాయి. ఆలయ కమిటీ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గానాగేశ్వరరావు, అధ్యక్షుడు భీశెట్టి కల్యాణ చక్రవర్తిల ఆధ్వర్యంలో జరిగిన కల్యాణానికి స్థానికులతోపాటు అనకాపల్లి, మునగపాక, తాళ్లపాలెం తదితర ప్రాంతాల నుంచి ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తిలకించారు. ముందుగా స్వామికి అభిషేకాలు నిర్వహించి పూలు, తులసి మాలలతో అలంకరించారు.

నేత్రపర్వంగా సీతారాముల కల్యాణోత్సవం

కశింకోటలోని దేవదాయ శాఖ కోదండ సీతారామచంద్రమూర్తి స్వామి ఆలయంలో బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ పేరి పృథ్వీచరణ్ శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. శ్రీరామపట్టాభిషేకం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు వేదుల వెంకటశాస్త్రి, ఆర్‌ఈసీఎస్ రిటైర్డ్ ఎండీ గరిమెళ్ల శ్రీనివాసరావు, సంఘ అధ్యక్షురాలు అవసరాల సీతాకామేశ్వరి, సభ్యులు ఎం.కిషోర్, గుళ్లపల్లి వెంకటేశ్వరులు, అవసరాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దేమునిగుమ్మం వెంకన్నను దర్శించిన మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్: స్థానిక దేవునిగుమ్మం వేంకటేశ్వర స్వామిని రాష్ట్ర పరిశ్రమలు, పెట్టుబడులు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు పులకండం గిరిబాబు ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఈవో జి.వి.రమాబాబు స్వామి వారి ప్రసాదాన్ని మంత్రి అమర్‌నాథ్‌కు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ సీనియర్ నేతలు దాడి జైవీర్, పీలా రాంబాబు, ఆలయ మాజీ చైర్మన్ సకల గోవిందరావు, సిబ్బంది పాల్గొన్నారు.



కశింకోట గవరపేటలో నిర్వహిస్తున్న వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం



కశింకోట ఆలయంలో పూజలందుకున్న లక్ష్మీనృసింహ స్వామి



దేవునిగుమ్మం వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న దాడి రత్నాకర్ దంపతులు

శ్రీవారిని దర్శించుకున్న భక్తకోటి

వైకుంఠ ఏకాదశి పర్వదినాన ముక్కోటి దేవతలు ఒకచోటకు చేరే నానుడితో పట్టణంలోని వైష్ణవాలయాలు భక్తులతో పోటెత్తాయి. దేవునిగుమ్మం వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈవో రబాబాయి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉత్తర ద్వారాల వెనుక ఉన్న శ్రీవారిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. శ్రీనివాసుడిని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తకోటి సుఖసంతోషాలతో ఉండాలని ఆయన పూజించారు. పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తులకు మిఠాయిలు, పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు పులకండం విజయబాబు, గిరిబాబు, 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య, పి.ఎస్.కె.నాయుడు, భీశెట్టి వరకుమార్, కర్రి వెంకటరావు, రేబాక ఇంద్రకుమార్ పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

కూరగాయల బజారు వద్ద కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామిని భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. సుప్రభాత సేవ, ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గాంధీనగరం వెంకన్న ఆలయంలో..

గాంధీనగరం వెంకన్న ఆలయంలో అర్చకుడు చక్రవర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైకుంఠ ద్వారం ద్వారా అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. స్వామివారిని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత దంపతులు దర్శించి పూజలు చేశారు. మండలంలో మేజర్ పంచాయతీ తుమ్మపాలలోని వేంకటేశ్వర స్వామిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, అన్నపూర్ణ బ్యాంకు చైర్మన్ పి.డి. గాంధీ, సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



వెంకన్న ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగిస్తున్న కల్యాణ దంపతులు



దేవునిగుమ్మం శ్రీనివాసుడి ఆలయంలో వైకుంఠ ద్వారం వద్ద క్యూలో ఉన్న భక్తులు



ఊరేగింపులో కోలాటమాడుతున్న మహిళలు



శ్రీనివాసుడి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తజనం



కశింకోట కోదండ సీతారామాలయంలో నిర్వహిస్తున్న సీతారాముల కల్యాణోత్సవం



నరసింగబిల్లిలో వేంకటేశ్వర స్వామి వైకుంఠ ద్వార దర్శనంలో భక్తులు



కన్యకాపరమేశ్వరి ఆలయంలో వైకుంఠ ద్వారంలో ఏర్పాటు చేసిన శ్రీవారు

సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు..'



వృద్ధురాలికి సంక్షేమ పథకాల ప్రతిని అందజేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



విసన్నపేటలో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

- మంత్రి గుడివాడ అమర్‌నాథ్

కశింకోట: ప్రజా సమస్యలను ఎక్కడికక్కడ పరిష్కరించడానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని విసన్నపేటలో సోమవారం రాత్రి గడప గడపకు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రతులను లబ్ధిదారులకు అందజేశారు. ప్రజా సమస్యల అడిగి గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో వస్తున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనేక సమస్యలు వెంటవెంటనే పరిష్కారమవుతున్నాయని చెప్పారు. దీంతో ఇటువంటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సీఎం వైఎస్ జగన్‌ను ప్రజలు మెచ్చుకుంటున్నారన్నారు. పింఛన్లను ఈ నెల నుంచి రూ.2,500 నుంచి రూ.2,750కు పెంచి అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని అర్హులుంటే సంబంధిత సచివాలయంలో దరఖాస్తు చేసుకుని పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా విసన్నపేటలో రూ.20 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును మంత్రి అమర్‌నాథ్ ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి అడుగడుగునా మహిళలు హారతులు పట్టి పూలు జల్లి, దుశ్శాలువాలు కప్పి మంత్రిని సత్కరించారు.

ఎంపీపీ కలగా లక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు కలగా గున్నయ్యనాయుడు, ఉప్పనూరి మాణిక్యం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, పార్టీ నాయకులు ఉప్పనూరి అప్పారావు, నడిశెట్టి జోగి తదితరులు పాల్గొన్నారు.

నేడు కొత్త పెన్షన్ల పంపిణీ



తుమ్మపాలలో సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అనకాపల్లి రూరల్: అనకాపల్లి మండలంలో కొత్తగా మంజూరైన 339 పెన్షన్లను మంగళవారం ఉదయం తుమ్మపాలలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పంపిణీ చేస్తారని గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్యనాయుడు సోమవారం స్థానిక విలేకరులకు తెలిపారు. తుమ్మపాల బంగార్రాజు కల్యాణ మండపం వద్ద ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. సభా వేదిక ప్రాంతాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం పరిశీలించారు. మంత్రితోపాటు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పలువురు ప్రజాప్రతినిధులు ,పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరవుతారని సర్పంచ్ చెప్పారు.

కొత్తూరులో మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

అనకాపల్లిటౌన్: జిల్లా పరిషత్ జడ్పీ చైర్‌పర్సన్ భీశెట్టి వరహా వెంకట సత్యవతి కుమారుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు భీశెట్టి జగన్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. మండలంలో కొత్తూరులో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు యువకుల నుంచి ఎన్టీఆర్ వైద్యాలయం రక్తనిధి కేంద్రం సిబ్బంది రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు జోసెఫ్, సర్వేజన ఐక్యవేదిక వ్యవస్థాపకుడు కోరిబిల్లి పరి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని తొక్కిపెడదాం



జ్యూట్ బ్యాగ్‌లతో గ్రీన్‌క్లబ్ సభ్యులు

అనకాపల్లిటౌన్: ప్లాస్టిక్ భూతాన్ని తొక్కిపెడదామని గ్రీన్‌క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ పిలుపునిచ్చారు. స్థానిక బెల్లం మార్కెట్ యార్డులో సోమవారం 120 మందికి ఆయన జ్యూట్ బ్యాగ్‌లు, మాస్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను ప్రతి ఒక్కరూ నిషేధించాలన్నారు. ముందుగా క్లబ్ డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పెంటకోట ఉమామహేశ్వరరావు, వై.అప్పారావు, బీరా వినోద్‌కుమార్, కాండ్రేగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో ఆధ్యాత్మిక సందడి

సబ్బవరం: మండలంలోని పలు ఆలయాల్లో సోమవారం వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. సబ్బవరం సీతారాముల ఆలయంతో పాటు గొర్లివానిపాలెం,పెదనాయుడుపాలెం,రావలమ్మపాలెం,మల్లునాయుడుపాలెం, అసకపల్లి,అమృతపురం,దేవీపురం,గుల్లేపల్లి బంగారమ్మపాలెం గ్రామాల్లోని రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు,భజనలు నిర్వహించారు.

బాల్ బ్యాడ్మింటన్ విజేతలకు అభినందనలు

పరవాడ: వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో గత నెల 29 నుంచి 31 వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీల్లో వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థులు తమ సత్తాను చాటి ద్వితీయ స్థానంలో నిలిచారు. సోమవారం పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎస్.ఖగేశ్వరరావు, ఫిజికల్ డైరెక్టర్ బి.అన్నాజీరావు, ఉపాధ్యాయులు వరలక్ష్మి తదితరులు విద్యార్థులను అభినందించారు.

సింహాద్రి జీజీఎంకు శుభాకాంక్షలు



సింహాద్రి జీజీఎం సిన్హాకు బొకే అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న యూనియన్ ప్రతినిధులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ నూతన ప్రాజెక్టు హెడ్‌గా బాధ్యతలు స్వీకరించిన సంజయ్ కుమార్ సిన్హాను సోమవారం ఐఎన్‌టీయూసీ (ఎన్‌ఎంయూఎస్) జనరల్ సెక్రటరీ బి.భీమరాజు, యూనియన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శుభాకాంక్షలు తెలిపి సంస్థ అభివృద్ధికి తమ సహకారం ఉంటుందని చెప్పారు.

జిల్లాలో 10 ఐవోబీ బ్రాంచ్‌లు

అనకాపల్లిటౌన్: జిల్లాలో ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్(ఐవోబీ) బ్రాంచ్‌లు 10 ఉన్నాయని సీనియర్ రీజనల్ బ్రాంచ్ మేనేజర్ బి.కె.సాహు తెలిపారు. పట్టణంలోని గవరపాలెం గౌరీ గ్రంథాలయ రహదారిలో సోమవారం ఆయన బ్రాంచ్‌ను ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తోందన్నారు. గృహ, వ్యాపార, వ్యవసాయ రుణాలు అందించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకటరమణ, వర్తక సంఘం అధ్యక్షుడు మళ్ల సాంబశివరావు, బ్రాంచ్ మేనేజర్ మహాత్మా, వైఎస్సార్‌సీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణ అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు

అనకాపల్లి రూరల్: తుమ్మపాలలో అన్నపూర్ణ బ్యాంక్ సొసైటీ వద్ద సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు ప్రారంభించారు. రైతులు నష్టపోకుండా ఉండాలన్న ఉద్దేశంతో మద్దతు ధరకు ప్రభుత్వమే ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని వారు చెప్పారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు ఎం.రామారావు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. క్వింటాల్ ధాన్యం ధర రూ2,040ను ప్రభుత్వం ప్రకటిచిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అన్నపూర్ణ బ్యాంక్ చైర్మన్ పీడీ గాంధీ, ఏవో పి.యు.బి.పి.రంగాచారి, ఎంపీటీసీ పంచదార్ల కన్నారావు, ఏఈవో ఎం.శ్రీనివాస్, గణేశ్, ఆత్మ ఏటీఎం రామకృష్ణ, రైతులు వెలగా భాస్కరనర్సింహారావు, కొణతాల అర్జున నాయుడు పాల్గొన్నారు.